నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 5 జనవరి 2024 | KHAMMAM

మున్ముందు మనదే విజయం

- ఉత్సాహంతో ముందుకు వెళ్లాలి
- బీఆర్ఎస్ నాయకులతో మాజీ మంత్రి పువ్వాడ

మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, జనవరి 4 : 'రాబోయే కాలంలో విజయాలన్నీ మనవే. అందుకే, ఉత్సాహంతో ముందుకు వెళ్లాలి' అని బీఆర్ఎస్ నాయకులు-ప్రజాప్రతినిధులను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. వారితో ఆయన గురువారం ఖమ్మంలోని తన నివాసంలో సమావేశమయ్యారు. ఎన్నికల్లో గెలుపోటములు సాధారణమేనని అన్నారు.

ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికలు ఒక భాగం మాత్రమేనని, ప్రజల తీర్పును గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వచ్చే ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అధిష్టానం మేరకు పని చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమాయత్త సమావేశాన్ని ఈ నెల 9న హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహిస్తారని చెప్పారు. ప్రతి నియోజకవర్గం నుంచి 100 మంది ముఖ్యులు తప్పక హాజరుకావాలన్నారు. సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆర్‌జేసీ కృష్ణ, భీరెడ్డి నాగచంద్రారెడ్డి, మద్దినేని వెంకటరమణ, తాళ్లూరి జీవన్ కుమార్, వైస్ ఎంపీపీ గుత్తా రవి, నున్నా మాధవరావు, తాజుద్దీన్, శీలంశెట్టి వీరభద్రం, ఇస్సాక్, షౌకత్ అలీ, వీరూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

భద్రాద్రి డీఈవో వెంకటేశ్వరాచారి

మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరాచారి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 4 : ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నదని, చిన్నతనం నుంచే విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించాలని డీఈవో వెంకటేశ్వరాచారి అన్నారు. స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై జిల్లా స్థాయి నాటికలు, ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహించారు. గురువారం జరిగిన పోటీల ముగింపు కార్యక్రమంలో డీఈవో పాల్గొని విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. అలాగే రాష్ట్ర నేషనల్ గ్రీన్ కార్ప్స్ ప్రాజెక్టు ఆఫీసర్ ఆఫీసర్ రాధిక, జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజులు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి తమ అభిప్రాయాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ కో ఆర్డినేటర్ ఎం.రాజశేఖర్, న్యాయ నిర్ణేతలు కొండల్‌రావు, సత్యనారాయణ, రాజు, కరుణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందేలా చూడాలి

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

గ్రామ సభలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం, జనవరి 4 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలు అర్హులకు అందించే విధంగా అధికారులు కృషి చేయాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. గురువారం సర్వాపురంలో జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తెల్లం మాట్లాడుతూ ప్రజలు సమర్పించే దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అర్హులను ఎంపిక చేసి వారికి లబ్ధి చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవో మంగీలాల్, ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, మండల అధ్యక్షుడు అన్నెం సత్యాలు, ఉపాధ్యక్షుడు కామేశ్, ఎంపీటీసీ తిరుపతిరావు, తునికి సీత, తెల్లం రామకృష్ణ, దామెర్ల శ్రీనివాసరావు, బొల్లి శేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నైట్ ఫెస్ట్ విజేత దమ్మపేట

ఎమ్మెల్యే జారేకు స్వాగతం పలుకుతున్న ఆర్సీవో, ప్రిన్సిపాల్

దమ్మపేట రూరల్, జనవరి 4 : దమ్మపేట గిరిజన గురుకుల కళాశాల (సీవోఈ)లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఇగ్నైట్ ఫెస్ట్‌కు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు గురువారం హాజరయ్యారు. ఫెస్ట్‌లోని పలు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో 14 పాఠశాలలు, కళాశాలలకు చెందిన 1,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సైన్స్ ఫెయిర్, యూత్ పార్లమెంట్, స్పాట్ డ్రాయింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా.. దమ్మపేట గిరిజన గురుకుల కళాశాల ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు దక్కించుకున్న విద్యార్థులకు రూ.500, రూ.400 చొప్పున పారితోషికం ఖమ్మం రీజినల్ కో ఆర్డినేటర్ తుమికి వెంకటేశ్వరరాజు, ప్రిన్సిపాల్ జానునాయక్ అందజేశారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న
తల్లిదండ్రులకు అభినందనలు

- భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల
- కిన్నెరసానిలో రాష్ట్రస్థాయి గిరిజన క్రీడలు ప్రారంభం

ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

బెలూన్లు గాలిలోకి వదులుతున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

వాలీబాల్ ఆడుతున్న పీవో ప్రతీక్ జైన్, ఎమ్మెల్యే

నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

పాల్వంచ రూరల్, జనవరి 4: క్రీడాకారులైన పిల్లలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు అభినందనలు తెలుపుతున్నానని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ప్రియాంక ఆల అన్నారు. పాల్వంచ మండలంలోని కిన్నెరసాని స్పోర్ట్స్ మోడల్ స్కూల్‌లో బుధవారం ఆమె ఐటీడీఏ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగనున్న రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్యార్థులు జాతీయ క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. గురుకుల పాఠశాలల్లో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన అశ్వారావుపేట, వైరా ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, రాందాస్ నాయక్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాలకు చెందిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులు విజ్ఞానాన్ని సంపాదించాలన్నారు. జడ్పీ చైర్మన్‌కంచర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థుల అభ్యున్నతికి రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతీయ స్థాయి క్రీడల్లో విజయం సాధించిన క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని ఎదగాలన్నారు. తొలుత అతిథులు క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆర్చరీ పోటీలను కలెక్టర్ ప్రియాంక ఆల ప్రారంభించగా వాలీబాల్ పోటీలను ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ ప్రారంభించారు. ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, రాందాస్‌నాయక్ విద్యార్థులతో కలిసి క్రీడలు ఆడుతూ వారిని ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ మణెమ్మ, ఇతర అధికారులు రమణయ్య, అలివేలు మంగతాయారు, బొల్లి గోపాల్ రావు, వెంకటనారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, నెహ్రూ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలి

సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కృష్ణ

ప్రొఫెసర్ కృష్ణను సత్కరిస్తున్న బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ లలితకుమారి

భద్రాచలం, జనవరి 4 : ప్రతి విద్యార్థి ఉత్తమ వ్యక్తిత్వం అలవర్చుకొని జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రావుల కృష్ణ ఆకాంక్షించారు. గురువారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బీఈడీ కళాశాలను రిసెర్చ్ స్కాలర్స్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన గిరిజన తెగల విద్యార్థుల కోసం భద్రాచలంలో ఏర్పాటు చేసిన బీఈడీ కళాశాల రాష్ట్రంలోనే అత్యుత్తమమైనదని అన్నారు. కళాశాలతో తనకు అనుబంధం ఉన్నదని, ప్రస్తుతం 25 బ్యాచ్ శిక్షణ పొందడం సంతోషంగా ఉందన్నారు. కళాశాల స్థాపకులు ప్రొఫెసర్ ఘంట రమేశ్‌ను గుర్తు చేసుకొని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్‌లో కళాశాలలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించడానికి సంసిద్ధతను తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ లలితకుమారి మాట్లాడుతూ విద్యార్థులందరూ అత్యుత్తమ శిక్షణ పొందాలని, విద్యను మించిన ధనం లేదని అన్నారు. నూతన విద్యా విధానాలకు అనుగుణంగా కళాశాలలో ఉత్తమ శిక్షణ అందిస్తామని తెలిపారు. అనంతరం రావుల కృష్ణను కళాశాల బృందం శాలువాతో ఘనంగా సత్కరించి.. సీతారామ, లక్ష్మణుల జ్ఞాపికను అందజేసింది.

పథకాలన్నీ ప్రజల ఇంటికే వస్తాయి

- వాటి కోసం ఎవరూ ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదు
- ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నింటినీ అమలు చేస్తాం
- ఖమ్మం పర్యటనలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

మహిళతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, జనవరి 4: ప్రభుత్వ పథకాల కోసం ప్రజలెవరూ ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పథకాలన్నీ ప్రతి ఇంటికీ వస్తాయని, ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చుతాయని అన్నారు. అభయహస్తం కార్యక్రమం కింద అమలు చేసే ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇచ్చిన మాట ప్రకారం తమ ప్రభుత్వం గ్యారెంటీ హామీలన్నింటినీ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలో గురువారం పర్యటించిన ఆయన.. 49వ డివిజన్‌లో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం కార్యక్రమం కింద ఐదు గ్యారెంటీల అమలు కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. గత నెల 28న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈ నెల 6 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ, అన్ని మున్సిపల్ వార్డుల్లోనూ నిర్ణీత తేదీల్లో కొనసాగుతుందని అన్నారు. అయితే ప్రజాపాలన గ్రామసభ రోజున దరఖాస్తు అందించలేని ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ నెల 6లోపు ఆయా దరఖాస్తులను తమ గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ వార్డు కార్యాలయాల్లో అధికారులకు అందజేయాలని సూచించారు. అయితే తాము చెప్పిన ఆరు గ్యారెంటీల్లో రెండు గ్యారెంటీలను ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోనే అమలుచేశామని గుర్తుచేశారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు సమర్పించేందుకు సభకు వచ్చిన ప్రజలతో ఆయన మాట్లాడారు. ఎవరెవరు ఏయే పథకాలకు దరఖాస్తు చేసుకున్నారో అడిగి తెలుసుకున్నారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఏసీపీ హరికృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రూ.1.62 కోట్ల విలువైన 6.5 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

ఇద్దరు నిందితుల అరెస్టు

వివరాలు వెల్లడించిన కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్

లక్ష్మీదేవిపల్లి, జనవరి 4: గంజాయి రవాణా కట్టడికి భద్రాద్రి జిల్లా పోలీస్‌శాఖ, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ఎంత నిఘావేసినా అక్రమార్కులు ఏదో రకంగా తరలిస్తూనే ఉన్నారు. చిన్న చిన్న వాహనాల నుంచి లారీల వరకు ఎలాంటి వాహనంలోనైనా చాకచక్యంగా సరుకును రాష్ట్రాల సరిహద్దులు దాటిస్తున్నారు. భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని రేగళ్ల క్రాస్‌రోడ్డులో గురువారం పోలీసులు రూ.వేలు కాదు... రూ.లక్షలు కాదు.. ఏకంగా రూ.1.62 కోట్ల విలువైన 6.5 క్వింటాళ్ల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయి రవాణా ముఠా గుట్టు రట్టు చేశారు. లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ విలేకర్లకు వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లా అలాయి గ్రామానికి చెందిన సుందర్‌రామ్ అనే లారీ డ్రైవర్, ఇదే గ్రామానికి చెందిన సురేష్ అనే లారీ క్లీనర్ గత నెల 22న వారి స్థానిక జిల్లా నుంచి లారీలో తినుబండారాల లోడ్‌తో బయల్దేరారు. 28వ తేదీ సాయంత్రం ఏపీలోని రాజమండ్రికి వచ్చి సరుకు అన్‌లోడ్ చేశారు. అనంతరం 31వ తేదీన సూత్రధారుడైన రాజస్థాన్‌లోని బీజ్‌వీర్ జిల్లా నోఖా ప్రాంతానికి చెందిన ఓంప్రకాష్ సూచనల మేరకు ఏపీలోని చింతూరు ప్రాంతంలో గంజాయి సేకరించేందుకు బయల్దేరారు. సరుకు సిద్ధంగా లేకపోవడంతో ఈ నెల 3వ తేదీ వరకు అక్కడే ఉన్నారు. ఇదే రోజు 6.5 క్వింటాళ్ల సరుకును అక్కడ రూ.8 లక్షలకు కొని లారీలో ప్రత్యేకంగా తయారు చేసిన ఒక అరలో ఉంచి రాజస్థాన్‌కు తరలిస్తున్నారు. ఈక్రమంలో గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో లారీ లక్ష్మీదేవిపల్లి మండలంలోని రేగళ్ల క్రాస్‌రోడ్డు దాటుతుండగా స్థానిక పోలీసులు అడ్డుకుని సోదా చేశారు. లారీలో భారీగా గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.62 కోట్ల వరకు ఉంటుందని, ఇద్దరు నిందితుల నుంచి నాలుగు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాతో ప్రమేయం ఉన్న ఇతర వ్యక్తులను అదుపులోకి తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ తెలిపారు. అనంతరం భారీగా గంజాయిని పట్టుకున్న పోలీసులను ఆయన అభినందించారు.

రామయ్యకు విలాసోత్సవం

స్వామివారికి విలాసోత్సవం జరుపుతున్న అర్చకులు

భద్రాచలం, జనవరి 4 : ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా భద్రాచలం రామాలయంలోని గోకుల రామంలో గల వన విహార మండపంలో గురువారం స్వామివారికి విలాసోత్సవం కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. స్వామివారిని వెంకటేశ్వరునిగా అలంకరించి కల్పవృక్ష వాహనంపై వేంచేపు చేసి ప్రధానాలయం నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ వన విహార మండపానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ ప్రముఖులు హరిశ్చంద్రనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని పరవశించిపోయారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన శ్రీరామ నాట్యాలయం వారి ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్యం, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. చిన్నారులు చేసిన నృత్యాలను చూసి ప్రేక్షకులు మైమరిచిపోయారు.

జిల్లాకు సమాచార శాఖ ఏడీ ఆఫీస్ మంజూరు

ఖమ్మం, జనవరి 4: ఖమ్మం జిల్లాకు సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్(ఏడీ) కార్యాలయాన్ని మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో ఖమ్మం కేంద్రంగా ఏడీ కార్యాలయం ఉండేది. తెలంగాణ ఏర్పాటు, జిల్లాల పునర్విభజన తర్వాత ఇది సూర్యాపేట జిల్లాకు వెళ్లింది. ఏడీ ఆఫీస్ ఏర్పాటుతో జిల్లాకు అదనంగా ఏపీఆర్‌వో పోస్టులు-2, పబ్లిసిటీ అసిస్టెంట్ పోస్టులు-3, సీనియర్ అసిస్టెంట్ పోస్టు-1, టైపిస్ట్ పోస్టు-1, రికార్డు అసిస్టెంట్ పోస్టు-1 వస్తాయి. ఖమ్మంలో ఏడీ ఆఫీస్ ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర-జిల్లా ప్రతినిధులు ఇటీవల కలిసి విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి అంగీకరించారు. ఉత్తర్వులు వచ్చాయి. మంత్రికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ)జిల్లా శాఖ కృతజ్ఞతలు తెలిపింది.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ తదితరులు

ఖమ్మం, జనవరి 4 : ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అమలు చేస్తామని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టర్ ఖమ్మం నగరంలోని 46వ డివిజన్ జూబ్లీ క్లబ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజా పాలన గ్రామసభలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ గ్యారెంటీలతోపాటు ఇతర సమస్యలపై కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. జిల్లా యంత్రాంగం పరిధిలో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. అనంతరం ప్రజాపాలన కార్యక్రమానికి దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. గ్యారెంటీ పథకాలతోపాటు ఏయే అంశాలపై ప్రజలు అధికంగా దరఖాస్తు సమర్పిస్తున్నారనే అంశాన్ని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డుల కోసం ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నాయని తెలుసుకున్న కలెక్టర్.. వాటిని కూడా స్వీకరించాలన్నారు. ప్రజా పాలన కేంద్రానికి వచ్చి సమర్పించే ప్రతి దరఖాస్తును తీసుకోవాలని, వాటిని తిరస్కరించడానికి వీల్లేదన్నారు. దరఖాస్తులను బల్క్‌గా తీసుకోవద్దని అధికారులకు సూచించారు. కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. దరఖాస్తు పూరించడంపై ప్రజలకు ఈ సందర్భంగా కలెక్టర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, జడ్పీ సీఈవో అప్పారావు, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి జి.జ్యోతి, జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరామ్, డీఈవో సోమశేఖర శర్మ, 46వ డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలతో దిగుబడులు

ఉద్యాన తోటలను పరిశీలిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు, ఆదర్శ రైతు పాన్నుస్వామి

అశ్వారావుపేట, జనవరి 4 : ఉద్యాన పంటల నుంచి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని తమిళనాడు రాష్ట్రానికి చెందిన పొన్ను స్వామి అన్నారు. పామాయిల్, కొబ్బరి, వేరుశనగ పంటల ద్వారా వచ్చే నూనెను 40 ఏళ్లుగా వినియోగిస్తూ మంచి ఫలితాలు సాధించినట్లు వివరించారు. మండలంలోని గంగారం సమీపంలో గల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం ఆయన ఉద్యాన శాఖ రిటైర్డ్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఉద్యాన శాఖ రిటైర్డ్ అదనపు డైరెక్టర్ విష్ణుభూషన్, పలువురు రైతు సంఘం నేతలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను తయారు చేసిన ఒకవంతు అమల్వన్ నూనెను మూడొంతుల ఉద్యాన పంటల నుంచి సేకరించిన నూనెను కలిపి మొక్కలకు అందించడంతో పంట దిగుబడుల్లో మార్పు వచ్చిందన్నారు. మంత్రి తుమ్మల పిలుపు మేరకు అశ్వారావుపేట వచ్చినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో డ్రూడాయిల్‌తో ఉద్యాన తోటలను ఎలా సాగు చెయ్యొచ్చో ప్రయోగం చేసేందుకు తోటలను క్షేత్రస్థాయిలో సందర్శిస్తున్నానని తెలిపారు. నూనె వినియోగంతో సేంద్రియ పద్ధతిలో ఉద్యాన పంటల సాగు ఎలా చేయాలో నమూనాగా కొన్ని పామాయిల్, కొబ్బరి మొక్కలను తీసుకొని ప్రయోగం చేయడానికి ప్రయత్నిస్తున్నానని తెలిపారు. ఆయన వెంట రైతు సంఘం నాయకులు ఆలపాటి రామ్మోహనరావు, సాయిబాబు, కొక్కెరపాటి పుల్లయ్య, బండి భాస్కర్, మురళీకృష్ణంరాజు, దొడ్డా ప్రసాద్, పలువురు రైతులు ఉన్నారు.